భద్రాద్రి కొత్తగూడెం
శనివారం 25 నవంబర్ 2023



## కేసీఆర్ పరిపాలన బావుంది



కేసీఆర్ పాలన చాలా బాగుంది. 24 గంటల కరెంటుతో మోటర్లు ఉన్నవారికి ఇబ్బంది లేదు. కరెంటు ఉండడంతో రెండు పంటలు పండుతున్నాయి. చెరువులో నీళ్లు ఉంటే చెరువుల కింద కూడా రెండు పంటలు పండుతున్నాయి. కేసీఆర్ వచ్చాక రైతులకు కష్టలు లేవు, ధరణి రాకపోతే రెవెన్యూ ఆఫీసు చుట్టూ పాస్ పుస్తకాల కోసం తిరగాల్సి వచ్చేది. మళ్ళీ ఆయనే రావాలి.

**– పోకల కృష్ణ, రైతు అశ్వారావుపేట**

## 24 గంటలు కరెంటు వస్తున్నది



కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మూడు గంటలు, నాలుగు గంటలు మాత్రమే కరెంటు ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక, 24 గంటలు కరెంటు వస్తున్నది. పంటలు, తోటలకు నీళ్లు సరిపోతున్నాయి. పాస్ పుస్తకాల కోసం ఇంతకు ముందు ఆఫీసు చుట్టూ, ఎమ్మార్వో చుట్టూ తిరిగేటోళ్ళం. ఇప్పుడు ధరణి వచ్చాక.. అరకెరం ఉన్నా పోస్టులో ఇంటి కొచ్చి పాస్ పుస్తకాలు ఇస్తున్నారు. పొలం పన్నులు లేవు. రైతు బంధు డబ్బులు కూడా అకౌంట్‌లో పడిపోతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో అంతా బాగానే ఉంది.

**– కొత్త ప్రవీణ్, రైతు, అశ్వారావుపేట**

## కేసీఆర్‌తోనే రైతుల అభివృద్ధి



రైతుల బాధను ఎరిగిన ఏకైక సీఎం కేసీఆర్ ఒక్కరే. రైతులకు 24 గంటలు ఉచితంగా ఇస్తున్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాక ముందు గ్రామాల్లో రైతులకు కరెంట్ సమస్యలు, పంట పెట్టుబడి కోసం నానా ఇబ్బందులు పడ్డాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక ముఖ్య మంత్రి కేసీఆర్ వల్లే అభివృద్ధి సాధించింది. తెలంగాణ ఏర్పడక ముందు వ్యవసాయానికి కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. పంటలు ఎండిపోయి సరిగా పండక అప్పుల పాలై దళారులను ఆశ్రయించేవారు. పెట్టుబడి సహాయం అందిస్తున్నాడు.ఒక వేళ రైతు అకాల మరణం చెందితే రైతు కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం రైతు బీమా ద్వారా అందిస్తున్నారు. రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందాలంటే కేసీఆర్‌ను మూడోవసారి ముఖ్య మంత్రి చేయాలన్నారు. నా కుటుంబమంతా బీఆర్ఎస్‌కు ఓటేస్తాం. ప్రతీ ఒక్కరూ వేయాలని కోరుకుంటున్నా.

**– లక్కినేని రంగ, ప్రేగళ్లపాడు గ్రామ పంచాయతీ, ముత్యాలంపాడు, టేకులపల్లి మండలం**

## ధరణితోనే భూములకు రక్షణ



తెలంగాణ రాష్ట్రంలో భూముల రికార్డుల రక్షణ లభించింది. గతంలో భూముల పహణీలో రైతు విస్తీర్ణంలో రెండు ఎకరాలు ఉంటే కొంత కాలం తర్వాత దళారులు, అధికారులు కలిసి దాన్ని మరో ఇద్దరికి ఎక్కించి ఆరు ఎకరాలు చేసేవారు. వాస్తవంగా ఉన్నది రెండు ఎకరాలే. కానీ ఇప్పుడు ధరణి వచ్చాక అలా ఎక్కించటానికి వీలు లేకుండా నిజమైన రైతుకు న్యాయం జరుగుతుంది. ఇది సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైంది. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారు. ఆయనకు రైతులంతా మద్దతు తెలపాలి. పైసా ఖర్చు లేకుండా రైతుకు ఉపయోగపడే ధరణి కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలి. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలి.

**– లావుడ్యా హనుమంత్, బిల్లుతండా, టేకులపల్లి మండలం**

# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## దశాబ్దాల కాంగ్రెసోళ్ల పాలనలో కడగండ్లే

# చెయ్యికి పెత్తనమిస్తే చేటు

## కరెంటు ఖతమైతది.. 'ధరణి' మట్టిల కలుస్తది

- నాడు పంటకు నీరు పెట్టేందుకు నిత్యం పడిగాపులే
- ఎక్కడ చూసినా కాలిపోయిన మోటర్లు.. పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లే..
- కంటి నిండా కునుకుండదు.. కరెంటోళ్ల జాడుండదు..
- 'భూమాత'తో భూయాజమాన్యం 'హస్త'గత సమాప్తం
- కాంగ్రెప్ పార్టీ నేతల హామీలపై కన్నెర్ర చేస్తున్న రైతాంగం



కాంగ్రెస్ పార్టీ అంటేనే కరెంట్ కోతలు.. కర్షకుల ఆత్మహత్యలు.. ఆకలి చావులేనని యావత్ తెలంగాణ రైతులు గుర్తుచేసుకుంటున్నారు. దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెసోళ్లు తమకు కష్టాలే మిగిల్చారని, అధికారంలోకి రాక ముందు లేని పోని హామీలిచ్చి, అధికారం చేజిక్కించుకున్న తరువాత మాట మార్చడం వారికి అలవాటంటున్నారు. అది చాలదన్నట్లు మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో రైతులను మోసం చేసేందుకు కాంగ్రెసోళ్లు దిగారంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పంటలకు 24 గంటల పాటు ఉచిత కరెంట్ ఇస్తుంటే పీసీసీ అధ్యక్షుడు మూడుగంటల కరెంట్ ఇస్తే సరిపోతుందనడంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పది హెచ్‌పీ మోటర్ వాడడం రైతుల వల్ల కాదని, అంత ఆర్థిక భారం మోయలేరంటున్నారు. 'ధరణి' స్థానంలో 'భూమాత'ను తెచ్చి పచ్చగా ఉన్న గ్రామాల్లో భూతగాదాలు పెట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమైందంటున్నారు. రైతులను పీడించుకుతినే ముత్తాతల కాలం నాటి పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొచ్చేందుకు కుట్రలు పన్నుతుందంటున్నారు. గెట్టు తగాదాలు, దళారీ వ్యవస్థకు ఆజ్యం పోసేందుకు ఎదురుచూస్తున్నదం టున్నారు. రెవెన్యూ వ్యవస్థలో తిరిగి లంచాల పీడ తెచ్చేందుకు యత్నిస్తుందని మండిపడుతున్నారు. వివరాలు వారి మాటల్లోనే..

*– భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ)*



## డబ్బులు ఇచ్చే పనితప్పింది



ధరణిలో పొలం నెంబర్లు ఎక్కినాక ఎవరికి మార్చే అవకాశం ఉండదు. పుస్తకం కూడా పక్కాగా ఉంది. రెవెన్యూ ఆఫీస్‌కు పోయే పనిలేకుండా పోయింది. కరణాలు లేరు చాలా బాగుంది. వాళ్లు ఉంటే సర్కారు భూమి అని బోకరు మాటలు చెప్పి డబ్బులు గుంజేవాళ్లు. కేసీఆర్ మంచి పనిచేశారు వీఆర్ ఓలను తీసేసి. డబ్బులు ఇచ్చే పనితప్పింది. అలాంటి నాయకుడు కావాలి. అప్పుడు పాసుపస్తకంలో నెంబర్ ఎక్కాలంటే చేతిలో డబ్బులు పట్టుకుని ఆఫీస్‌కు తిరగాల్సి వచ్చేది.

**– గుత్తా కృష్ణ, పల్లిపాడు, ఏన్కూరు**

## కాంగ్రెస్ వస్తే చీకట్లే



కాంగ్రెస్ పాలన చీకటిమయం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు అంధకారమే. కాంగ్రెస్ పాలనలో రైతులు వ్యవసాయం చేయాలంటే నానా ఇబ్బందులు పడేవారు. రాత్రుళ్లు కరెంటు లేక పొలంగట్లపై రైతులకు పాముకాట్లతో ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయి. కరెంటు కోసం రోజంతా పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఉండేది. కరెంటు లేక... నీళ్లులేక పండించిన పంటలు నిర్దాక్షిణ్యంగా ఎండిపోయేవి. ఆకలిచావులు మిగేలివి. తెలంగాణ వచ్చాక రైతును రాజుచేసిన సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు, చెరువుల్లో, కుంటల్లో పుష్కలంగా సాగునీరు ఉండడంతో రైతులు ఎంతో సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. మాకు బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలి. **– మిడియం సురేశ్, రైతు, వైట్ నాగారం, దుమ్ముగూడెం**

## బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంట్ బాగుంది



బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంట్ సరఫరా బాగుంది. గత ప్రభుత్వాల హయాంలో రాత్రి సమయాల్లో మోటర్ల దగ్గరకు వెళ్లి నానా అవస్థలు పడ్డాం. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని అంటున్న కాంగ్రెసోళ్లపై రైతులు కోపంగా ఉన్నారు. రైతు చల్లగా ఉండాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండాలి. కాంగ్రెస్ నాయకుల మాటలను రైతులు నమ్మరు.

**– చర్ప కోమలు, రైతు, రాయినిపేట గ్రామం, కరకగూడెం మండలం**

## ధరణిని తీసేస్తే దళారుల రాజ్యమే



సీఎం కేసీఆర్ రైతులకు ఇస్తున్న రైతుబంధు ద్వారా ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయి. రైతుకు అనుకోని ఘటన జరిగితే ఆ కుటుంబాన్ని ఆదుకునేది రైతుబీమానే. ధరణి ద్వారా రైతుల భూములను వారికి కేటాయించి ప్రతి సంవత్సరం 'రైతుబంధు'ను వారి ఖాతాల్లో వేస్తున్నారు. గతంలో ధరణి లేనప్పుడు ఎవరి రాజ్యం ఉంటే వారిది భూమి అన్నట్లు ఉండేది. రికార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకొని అనేక అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో చాలామంది గోసపడ్డారు. వివాదాలు, ప్రతి నిత్యం గొడవలు, చంపుకున్న ఘటనలు కూడా అనేకం. ఇంకా కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు చాలామంది ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్న మాటల్లో నిజాయితీ కనిపించడం లేదు. పక్కరాష్ట్రం కర్ణాటకలో అనేక హామీలు ఇచ్చారు. అక్కడ రైతులు రోడ్డెక్కి గోస పడుతున్నారు.

**– ధరావత్ రమేశ్, రుద్రంపూర్‌తండా, రామవరం**

## కాంగ్రెస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు



ఒకరేమో కరెంటు మూడు గంటలు అంటాడు. మరొకరేమో అసలు తెలంగాణ అభివృద్ధి సాధించలేదంటారు. అబద్దపు మాటలు చెప్పి కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రావాలని ఆశపడుతూ మతిభ్రమించి మాట్లాడటం సిగ్గుచేటు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు, చచ్చేది లేదు. కాంగ్రెస్ హయాంలో ఒక్క పంట పండాలంటే ఇబ్బందిగా ఉండేది. నీరు, కరెంటు లేక దిక్కులు చూసేవాళ్ళం. చేసిన అప్పులు తీర్చలేక ముఖాలు చాటేసుకునేవాళ్లం. కొంతమంది ఆత్మగౌరవం కోసం ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేయలేక, పెట్టిన పెట్టుబడి రాలేక జీవచ్ఛవంలా ఉండేది. కాని నేడు 24 గంటలు ఇస్తున్న ఉచిత కరెంటుతో మూడు పంటలు పండించుకుంటున్నాం. ఇల్లాలి మంగళసూత్రాలు క్షేమంగా ఉన్నాయి. హస్తం మాటలకు ఎవరూ మోసపోరు. కేసీఆర్ సారు ఉన్నంత కాలం సర్కారు ఆయనదే.

**– దొడ్డ భాగ్యలక్ష్మి, ధర్మపురం గ్రామం, ఇల్లెందు మండలం**

ధరణి


## కౌలుదారులొస్తే అసలు రైతులకు ఎసరు



ధరణి ఫోర్టల్‌ను మార్చేసి, కౌలు రైతుల కాలమ్‌ను తీసుకొస్తే భూమి గల అసలు రైతులకు ఎసరొస్తుంది. కౌలుదారుల పేర్లను తీసుకురావడంతో వ్యవసాయం చేయని అసలు రైతులు తమ భూములను పడావు పెడతారు. కొంతవరకు వ్యవసాయ భూములు బీడుగా మారుతాయి. మూడు, నాలుగేళ్లు కౌలు చేసిన రైతులు, దొడ్డి దారిన అసలు రైతుల భూములను తమ పేరిట పట్టా చేసుకున్నా చేసుకుంటారు. ఈ భయంతో చాలామంది రైతులు తమ భూములను కౌలుకు ఇవ్వరు. ధరణి ఫోర్టల్‌ను మారిస్తే అసలు రైతులు, కౌలు రైతుల మధ్య కొట్లాటలొస్తాయి. వ్యవసాయం పడిపోవడంతోపాటు అక్రమాలు జరుగుతాయి. ధరణి పోర్టల్‌తో ఈ సమస్యలేవీ ఉండవు.

**– దూదిమెట్ల లక్ష్మీనారాయణ, రైతు, రాజాపురం, అన్నపురెడ్డిపల్లి మండలం**

## 24 గంటల కరెంట్‌తో పచ్చగా పంటలు



సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంటుతో పంటలు పచ్చగా ఉంటున్నాయి. రైతుల ఆత్మహత్యలు తగ్గిపోయాయి. కాంగ్రెస్ హయాంలో కరెంటు లేక రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని కాంగ్రెస్ వాళ్లు చెప్పారంటే.. నవ్వొస్తున్నది. ఆ మోటర్లను కొనాలంటే మాటలా..! చాలా ఖర్చవుతుంది. కాంగ్రెసోళ్ల మాటలు వింటే మాకు మళ్లీ కష్టాలే. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించి మా సత్తా చాటుతాం.

**– గొర్రెముచ్చు వెంకటరమణ, రైతు, నెల్లిపాక బంజరు, అశ్వాపురం మండలం**

## కాంగ్రెస్‌కు ఓటేసి బాధలు పడతామా?



కాంగ్రెస్ పాలనలో బావులు, బోర్లకు మోటర్లు పెడితే ఎకరం పొలం కూడా పారని పరిస్థితి. రాత్రుళ్లు కరెంటు ఇచ్చేవాళ్లు. నెలకోసారి మోటర్లు కాలిపోతుండేవి. తెలంగాణ వచ్చాక 24 గంటల కరెంటు వస్తున్నది. రైతు గోస చూసిన సీఎం కేసీఆర్.. రైతును రాజు చేసేందుకు, వ్యవసాయాన్ని పండుగలాగా చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు రాదు, వ్యవసాయం బంద్ పెట్టుకోవాల్సిందే. కాంగ్రెస్‌ను రానివ్వం. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు చూసి కూడా.. మళ్లీ దానికే ఓటేసి ఆ బాధలు తెచ్చుకుంటామా? మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే రైతులకు మరింత మేలు జరుగుతుంది.

**– శాఖపురి శ్రీను, రైతు, మోరంపల్లిబంజర్, బూర్గంపహాడ్ మండలం**

## ధరణితో రైతుకు మేలు



ధరణి పోర్టల్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. ధరణి వల్లే మా భూములకు పట్టా పుస్తకాలు వచ్చాయి. రైతుబంధు వస్తున్నది. ధరణితో రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి తప్పింది. కాంగ్రెస్ వాళ్లు భూమాత తెచ్చి ధరణిని రద్దు చేయాలని చూస్తున్నారు. ఇలా చేస్తే.. మళ్లీ గతంలోలాగా కష్టాలు మొదలైతయ్. ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. భూముల రికార్డులు కూడా భద్రంగా ఉన్నాయి. ఒకరి భూమి మరొకరికి వెళ్లే అవకాశం లేదు. ధరణితో నా పొలానికి సంబంధించి పట్టా పాస్‌బుక్‌లు వచ్చాయి. ధరణి ఉండటం వల్లే రైతుబంధు పక్కాగా వస్తున్నది.

**– కనకమేడల కోటేశ్వరరావు, రైతు, టేకులగుట్ట, అశ్వాపురం మండలం**

## అర్ధరాత్రి కరెంటు కష్టాలు తప్పాయి



తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతులకు కరెంటు కష్టాలు తప్పాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడు గంటల ఉచిత విద్యుత్ అని.. రెండు మూడు గంటలు కూడా సరిగ్గా ఇవ్వలేదు. అది కూడా అర్ధరాత్రి ఇచ్చేవారు. ఎప్పుడు కరెంటు వస్తదో..ఎప్పుడు పోతదో తెలియక, రైతులు మోటర్ల వద్ద పడిగాపులు కాశారు. ఇప్పుడు ఆ కష్టాలేవీ లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. మూడు గంటలు విద్యుత్ ఇస్తానంటోంది. అదే జరిగితే రైతులకు మళ్లీ చీకటి రోజులు వచ్చినట్లే. అటువంటి పాడు రోజులు మాకొద్దు, ఆ కాంగ్రెస్ పార్టీ మాకొద్దు. మాకు కేసీఆర్ సారే కావాలి. ఆయన పార్టీనే గెలిపిస్తం.

**– శెనగపాటి సీతారాములు, రైతు, ములకలపల్లి మండలం**

## ధరణితో రైతుల బాధలు తొలిగిపోయాయి



ధరణితో రైతుల భూవివాదాలు, బాధలు పూర్తిగా తొలిగిపోయాయి. ధరణి వచ్చాకనే దళారుల బెడద పూర్తిగా తప్పింది. గత పాలనలో, ముందు పహాణీ కావాలంటే పట్వారి కోసం వేయి కండ్లతో ఎదురుచేసేవాళ్లం, ఆ పని కూడా లంచం ఇస్తేనే జరిగేది. ఇప్పుడు నెట్ సెంటర్‌కు వెళ్లి ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లిస్తే ఐదు నిమిషాల్లో పట్టా ఇస్తున్నారు. తిరిగి మళ్లీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే పాత రోజులే వస్తాయి. రైతులకు ఇంత మేలు కలిగే కార్యక్రమాలు చేపట్టిన బీఆర్ఎస్ వైపే రైతులు ఉన్నారు.

**– ఇర్ప నాగేశ్వరరావు, రైతు, గొల్లగూడెం గ్రామం, కరకగూడెం మండలం**

## అప్పట్లో అరిగోస పడ్డాం..



కాంగ్రెస్ గెలిస్తే ధరణి పోర్టల్ తీసేస్తాం అంటున్నారు. దానికి బదులు భూమాతను తీసుకొస్తామని చెబుతున్నారు. అదే జరిగితే రైతులు పూర్వంరోజుల్లో లాగా అరగోస పడతారు. రైతులకు భద్రత ఉండదు. భూముల దోపిడీ జరుగుతుంది. డబ్బులు ఇయ్యలేని స్థితిలో ఉన్న రైతుల భూములు పరాయిపాలవుతాయి. అందుకే కేసీఆర్ సార్‌కే ఓటు వేయాలి. బీఆర్ఎస్ సర్కార్ వస్తేనే ధరణి ఉంటుంది. ధరణి ఉంటేనే దళారీ వ్యవస్థ పోతుంది. మా భూములు మాకు దక్కుతాయి. ధరణి అద్భుతమైన పోర్టల్ అరగంటలో రిజిస్ట్రేషన్ అయిపోతుంది. 15 రోజుల్లో పాస్‌బుక్‌లు ఇంటికొస్తాయి. ధరణి ఉండాలంటే బీఆర్ఎస్ రావాలి.

**– పెద్దమల్ల నరేందర్, రైతు, సుజాతనగర్**

## దళారుల వ్యవస్థ పోయింది



ధరణి రాక ముందు రెవెన్యూ కార్యాలయాల్లో దళారులు ఉండి డబ్బులు వసూల్ చేసి పనులు చేయించేవాళ్లు. వారిని కాదంటే కార్యాలయంలో పనులు జరిగేవి కాదు. కనీసం పహాణీ నకళ్ళు కావాలన్నా దళారీని ఆశ్రయించాల్సి వచ్చేది. వారు దండిగా డబ్బులు దండుకునే వాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రైతుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం ధరణి తీసుకురావడంతో అంతా ఆన్‌లైన్ విధానంలోనే పహాణీలు వస్తున్నాయి. ధరణి తీసేస్తే రైతు బంధు మూతబడే ప్రమాదం ఉంది. కార్యాలయాల్లో మళ్లీ తిరిగి దళారుల రాజ్యం వస్తుంది. కాబట్టే రైతులందరూ కేసీఆర్‌కే ఓటు వేసి గెలిపించాలి.

**– ఇడుపుల సుందరయ్య, రైతు, కాకర్ల, జూలూరుపాడు**

## ధరణితో సమస్యలు తీరినవి



ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూముల సమస్యలు 'ధరణి'తో తీరిపోయాయి. అంతకముందు బ్యాంకు లోను కావాలంటే పహాణీ నకళ్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆన్‌లైన్‌లో పహాణీలు వస్తుండడంతో ఎవరి దగ్గరకీ వెళ్లకుండానే క్షణాల్లో పహాణీలు,1బీ నకళ్లు వస్తున్నాయి. ధరణి రావడం వల్ల రైతుబంధు, రైతుబీమా వస్తోంది. వాటితో పంటలకు పెట్టుబడి పెట్టుకుని అప్పులు లేకుండా వ్యవసాయం చేస్తున్నాము. రైతుల కోసం ఇంతగా ఆలోచిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపిస్తాము.

**– పెంటి నాగేశ్వరరావు, రైతు, పడమటనర్సాపురం, జూలూరుపాడు**

## అప్పటి రోజులు మర్చిపోలేము..



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ కోసం పడ్డతిప్పలు మర్చిపోలేము. వాళ్ల అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో కూడా తెలియని పరిస్థితి ఉండేది. పొలాల వద్ద రాత్రి పూట కాపలా కాచి మరీ కరెంట్ రాగానే నీళ్లు పెట్టుకునేవాళ్లం. కరెంటు షాకుతో రైతుల మరణాలు రోజూ ఎక్కడో ఒకచోట జరుగుతుండేది. పదేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంట్ సరఫరా చేస్తుండడంతో రైతులం హాయిగా పంటలు పండించుకుంటున్నాం. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందిస్తుండడంతో వ్యవసాయాన్ని పండుగలా చేస్తున్నాము. మర్చిపోయి కూడా కాంగ్రెస్ పార్టీకి రైతులు ఓటు వేయరు.

**– చావా వెంకటరామారావు, రైతు, కాకర్ల, జూలూరుపాడు**